భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 34.0
కనిష్ఠం : 26.0



ఎన్నో ఆశలు.. మరెన్నో సవాళ్లు

వెంకయ్య వయ్యేరు ప్రవాహానికి అడ్డంకులు



కూటమి ప్రభుత్వంతో ప్రాజెక్ట్‌లకు మోక్షం

- నిధులు కేటాయిస్తేనే పనులు ముందుకు
- వైసీపీలో పడకేసిన పనులు..

బాబుపైనే జనం నమ్మకం

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జిల్లా ప్రాజెక్ట్‌లపై ఆశలు చిగురించాయి. వైసీపీ ప్రభుత్వంలో కీలక ప్రాజెక్టులు పడకేశాయి. ప్రభుత్వం నిధులు కేటాయించలేదు. పనులు ముందుకు సాగలేదు. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వంలో ప్రాజెక్ట్‌లు ముందుకు సాగుతాయన్న భరోసా ఏర్పడింది. ఓ వైపు నిధుల మంజూరు, మరోవైపు కాంట్రాక్టర్లలో విశ్వసనీయత కలిగించాలి. అప్పుడే ప్రాజెక్టులు కొనసాగే అవకాశం ఉంది. నిధులే ఇప్పుడు ప్రధాన సమస్యగా ఉన్నాయి. గ్రామాలకు వాటర్ గ్రిడ్ ప్రాజెక్ట్ పడకేసింది. ఐదేళ్ల వైసీపీ పాలనలో సర్వేకే పరిమితమయ్యారు. ఇప్పటికే సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక సిద్ధం కాలేదు. పనులు దక్కించుకున్న సంస్థ సర్వే నిర్వహిస్తూనే ఉంది. గోదావరి జలాలను శుద్ధి చేసి జిల్లాలోని గ్రామాలకు మంచినీటిని సరఫరా చేసేందుకు వాటర్‌గ్రిడ్ ప్రాజెక్ట్‌లను రూపొందించారు. వాస్తవానికి ఇది 2016లోనే తెరపైకి వచ్చింది. అప్పటి తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఉమ్మడి పశ్చిమ గోదావరి వ్యాప్తంగా గ్రామాలు, పట్టణాలకు గోదావరి జలాలను శుద్ధి చేసి నేరుగా పంపిణీ చేయాలని సంకల్పించింది. అందుకోసం దాదాపు రూ.3,800 కోట్లు వ్యయం కానుందని అంచనా వేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రాజెక్ట్ వ్యయాన్ని కుదించారు. విస్తీర్ణాన్ని తగ్గించారు. కేవలం జిల్లాలోని ఏడు నియోజకవర్గాల గ్రామాలకు మాత్రమే వాటర్ గ్రిడ్ ప్రాజెక్ట్‌ను కుదించారు. నిధులను తగ్గించారు. ఇప్పటి వరకు పనులు ప్రారంభించలేదు. టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో జిల్లా ప్రజల్లో ఆశలు రేకెత్తాయి. వాటర్ గ్రిడ్ అమలుకు నోచుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఆక్వా యూనివర్శిటీకి మోక్షం

నర్సాపురంలో ఆక్వా యూనివర్శిటీని ప్రారంభించిన జగన్ అమలులో విఫలమయ్యారు. ఇప్పటికీ ఆక్వా యూనివర్శిటీ తరగతులు ప్రారంభం కాలేదు. పరిశోధనలు నిర్వహించడం లేదు. భూసేకరణకే పరిమితమయ్యారు. భూములను గుర్తించారు. తరగతుల కోసం అద్దె భవనాలను ఏర్పాటు చేశారు. కానీ అడ్మిషన్‌లు నిర్వహించలేదు. తెలుగుదేశం కూటమి అధికారంలోకి వస్తే జిల్లాలో ఆక్వా యూనివర్శిటీని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అది నెరవేరితే ఆక్వా రైతులకు ఎంతగానో ప్రయోజనం చేకూరనుంది.

మూడు పట్టణాలకు పైప్‌లైన్ ప్రాజెక్ట్‌లు

గతంలో తెలుగుదేశం కూటమి అధికారంలో ఉన్నప్పుడు పాలకొల్లు, తణుకు, నిడదవోలు పట్టణాలకు దాదాపు రూ.226 కోట్లతో పైప్‌లైన్ ప్రాజెక్ట్‌లు ఏర్పాటు చేయాలని సంకల్పించారు. టెండర్లు ఖరారు చేశారు. వైసీపీ ప్రభుత్వంలో పైప్‌లైన్ ప్రాజెక్ట్ విషయం పట్టించుకోలేదు. ప్రాజెక్ట్ మరుగున పడిపోయింది, కాంట్రాక్ట్ ఏజెన్సీ అంతగా ఆసక్తి చూపలేదు. ఇప్పుడు మళ్లీ కూటమి అధికారం చేపట్టడంతో పైప్‌లైన్ ప్రాజెక్ట్‌కు మోక్షం లభించే అవకాశం ఉంది. అయితే గతంలో ఉన్న ధరలకు, ఇప్పటి ధరలకు పొంతన లేదు. పాత ధరలతో కాంట్రాక్టర్ పనులు చేపట్టే అవకాశం లేదు. మళ్లీ కొత్త అంచనాలు రూపొందించాలి. అంటే పాత అంచనాలను సవరించాలి. వాటికి ప్రభుత్వం అనుమతి ఇవ్వాలి. మళ్లీ టెండర్లు పిలవాలి. లేదంటే పాత కాంట్రాక్టర్‌కే పనులు అప్పగించాలి. అప్పుడే మూడు పట్టణాలకు మంచినీటి సమస్య తీరనుంది. నేరుగా విజ్జేశ్వరం నుంచి శుద్ధి చేసిన జలాలు అందనున్నాయి. ప్రస్తుత వాటర్ గ్రిడ్ పథకంలో పట్టణాలు లేవు. కేవలం గ్రామాలకు మాత్రమే గోదావరి జలాలను శుద్ధిచేసి సరఫరా చేయనున్నారు. పట్టణాలకు గతంలో తెలుగుదేశం ప్రభుత్వంలో మంజూరుచేసిన పైప్ లైన్ ప్రాజెక్ట్ దిక్కు కానుంది. అది కార్యరూపం దాలిస్తే తణుకు, పాలకొల్లు, నిడదవోలు పట్టణాలకు మంచినీటి సమస్య తీరనుంది.

హార్బర్ కల తీరేనా

జగన్ సీఎం హోదాలో బియ్యపు తిప్ప వద్ద హార్బర్‌కు శంకుస్థాపన చేశారు. కానీ ఒక్క ఇటుక వేయలేదు. నిర్మాణం చేపట్టలేదు. తెలుగుదేశం హార్బర్‌పై గతంలో హామీ ఇచ్చింది. హార్బర్ కల నెరవేరాలంటే నిధులు అవసరం కానున్నాయి. కేంద్రం నిధులు మంజూరుచేయాలి. జిల్లాలో హార్బర్‌కు అనుకూలం కాదంటూ గతంలో కేంద్రం తేల్చింది. ఇప్పుడు మళ్లీ కేంద్రం అనుమతిస్తే రాష్ట్రంపై ఆర్థిక భారం పడదు. ఆ దిశగా ప్రయత్నాలు చేయాలి. అప్పుడే హార్బర్ కల నేరవేరుతుంది. తీర ప్రాంతం వృద్ధిలోకి వస్తుంది.

పెండింగ్‌లో జాతీయ రహదారులు

జిల్లాలో జాతీయ రహదారులు పెండింగ్‌లో ఉన్నాయి. భీమవరం మీదుగా వెళ్లే జాతీయ రహదారికి మోక్షం లభించలేదు. వైసీపీ హయాంలో రహదారులు జోలికి పోలేదు. భీమవరంలో భూసమస్య ఏర్పడింది. ఇప్పుడవన్నీ తొలగించి జాతీయ రహదారులు నిర్మాణానికి పెద్ద పీట వేయాలి. గత కూటమి ప్రభుత్వంలో రహదారులను అభివృద్ధి చేశారు. ఇప్పుడు కూటమికి ప్రజలు పట్టం కట్టారు. దీంతో జాతీయ రహదారులకు మోక్షం లభించనుంది. భీమవరం-తాడేపల్లిగూడెం రహదారికి కేంద్రం జాతీయ హోదా కల్పించింది. దానికి నిధులు కేటాయించాలి. ఇక్కడ నుంచే ప్రతిపాదనలు వెళ్లాలి. జాతీయ రహదారి ఏర్పడితే భీమవరం-తాడేపల్లిగూడెం మధ్య రాకపోకలు సునాయాసం కానున్నాయి. రెండు పట్టణాల అభివృద్ధికి జాతీయ రహదారి ఎంతగానో దోహదపడనుంది.

పడకేసిన ప్రభుత్వ వైద్య కళాశాల

జిల్లాలో ప్రభుత్వ వైద్య కళాశాల పడకేసింది. పాలకొల్లు మండలం దగ్గులూరులో ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణానికి కసరత్తు చేశారు. పనులు మాత్రం సాగడం లేదు. నిధులు కేటాయిస్తేనే పనులు నిర్వహించే అవకాశం ఉంటుంది. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. అప్పుడే ప్రభుత్వ వైద్య కళాశాల కల నేరవేరుతుంది. జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి.

వశిష్ట వారధి కల నెరవేరేనా

పశ్చిమ-కోనసీమ జిల్లాలను కలిపే వశిష్ట వారధికి వైసీపీ హయాంలో టెండర్లు పిలిచారు. కాంట్రాక్టర్లు స్పందించలేదు. ప్రభుత్వంపై నమ్మకం సడలిపోయింది. టీడీపీ కూటమిలో అభివృద్ధి జరుగుతుందన్న నమ్మకం అందరిలోనూ ఉంది. వశిష్ట వారిధి నిర్మాణానికి నోచుకోనుంది. ఈ సారి కాంట్రాక్టర్లు స్పందించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. వశిష్ట వారధి పూర్తయితే పశ్చిమ-కోనసీమల మధ్య రాకపోకలు సులభ తరం కానున్నాయి. నర్సాపురం-కోటిపల్లి రైల్వేలైన్ ప్రాజెక్ట్‌కు వైసీపీ ప్రభుత్వం నిధులు కేటాయించలేదు. దీంతో ప్రాజెక్ట్ పెండింగ్‌లో పడింది. రాష్ట్ర ప్రభుత్వం తన వంతు నిధులు కేటాయిస్తే కేంద్రం ప్రాజెక్ట్ పనులు చేపడుతుంది. కూటమి హయాంలో ఇది కూడా నెరవేరుతుందన్న ఆశ జిల్లా ప్రజల్లో ఉంది.

సాగు, తాగు నీటికి ఇబ్బందులు

గణపవరం, జూన్ 14 : ఖరీఫ్ సీజన్ వచ్చేసింది. రైతులు నారుమడులకు సిద్ధమవుతున్నారు. నీటి కోసం వెంకయ్య వయ్యేరుపైనే ఆధారపడుతున్నారు. పరిమెళ్ల లాకుల నుంచి గణపవరం మీదుగా ఆకివీడు శివారు ప్రాంతాల వరకు 60 గ్రామాల పరిధిలోని పొలాలకు, చేపలు, రొయ్యల చెరువులతోపాటు ప్రజల తాగు నీటి అవసరాలకు ఈ కాల్వే ఆధారం. కాని, నీటి ప్రవాహానికి గుర్రపు డెక్క అడ్డుగా నిలవడం రైతుల పాలిట శాపంగా మారింది. రైతుల సంక్షేమమే లక్ష్యంగా ఇప్పటి వరకు డాంబికాలు పలికిన జగన్ సర్కార్ ఇరిగేషన్ రంగాన్ని గాలికి వదిలేసింది. గణపవరం, బొబ్బిలి వంతెన, ఇరిగేషన్ కార్యాలయం ఎదుట కాల్వలో గుర్రపు డెక్క, మేట వేసుకుపోయి చిట్టడివిలా తయారైంది. దీని తొలగింపుపై దృష్టి సారించలేదని రైతులు, ప్రజలు మండిపడుతున్నారు. గుర్రపు డెక్క, తూడు తొలగించి ప్రవాహానికి ఆటంకం లేకుండా చేయాలని రైతులు, ప్రజలు అనేక సార్లు మొర పెట్టుకున్న అధికారులు పట్టించుకోలేదు. ప్రస్తుతం ఖరీఫ్ నారుమడులు పోసుకునే సమయం రావడంతో పాటు తాగునీటి చెరువులు అడుగంటిపోయాయి. నీటిని నింపుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గణపవరంలో మంచి నీటి చెరువు అడుగంటి పోయిందని బురద వాసన వస్తున్న నీటినే ఇప్పటి వరకు ప్రజలు వినియోగించుకుంటున్నారు. తూడు, గుర్రపు డెక్క వల్ల నీటి ప్రవాహం మందగించటంతో స్వచ్ఛమైన నీరు లభించక చెరువులు నింపలేకపోయామని పంచాయతీల కార్యదర్శులు చెబుతున్నారు. వేసవిలో చేపలు, రొయ్యల చెరువులకు నీరు లభించక కాల్వకు నీరు వదిలినా వినియోగానికి రావడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. నీటిపారుదల శాఖ మంత్రిగా నిమ్మల రామానాయుడు నియమితులు కావడంతో ఈ సమస్యలకు పరిష్కారం లభించినట్లేనని రైతులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. యుద్ధ ప్రతిపాదికన గుర్రపు డెక్కను తొలగించి సాగు, తాగునీటి ప్రవాహానికి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు. గణపవరం ఇరిగేషన్ సెక్షన్ ఏఈ ఫణిశంకర్ మాట్లాడుతూ గుర్రపు డెక్క తొలగింపుకు టెండర్లు ప్రక్రియ జరుగు తోందని, వారం రోజుల్లో ఇది పూర్తయిన వెంటనే పనులు చేపడతామని చెప్పారు.



పింఛన్ల పరవశం

- వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, బెడ్ రిడెన్‌లకు ఆనందం

తాడేపల్లిగూడెం రూరల్/ఆచంట/తణుకు, జూన్ 14: చంద్రబాబు సర్కార్ కొలువు తీరగానే పింఛన్‌దారుల కళ్లల్లో ఆనందం రెట్టింపైంది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నెరవేరుస్తూ చంద్రబాబునాయుడు పింఛన్ల పెంపుదలపై సంతకం చేశారు. దీంతో ఇటు వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, అనారోగ్యంతో కదలలేని పరిస్థితుల్లో ఉన్నవారు, కుల వృత్తిదారులు ఇలా అన్నివర్గాలకు పింఛన్లు పెరగనున్నాయి. వృద్ధులు, వితంతు వులు, ఒంటరి మహిళలు, నేతన్నలు, మత్స్యకారులు, గీత కార్మికులు, డప్పు కళాకారులు, హెచ్ఐవీ బాధితులు, హిజ్రాలకు నెలకు రూ.4 వేలు అందించనుండగా, దివ్యాంగులకు రూ.6 వేలు ఇవ్వనున్నారు. కుష్టుతో వైకల్యం సంభవించిన వారికి రూ.6 వేలు, కిడ్నీ, కాలేయం, గుండె మార్పిడి చేసుకున్న వారికి డయాలసిస్ స్టేజి ముందున్న కిడ్నీ వ్యాధిగ్రస్థులకు రూ.10 వేలు ప్రకటించారు. మంచానికి పరిమితమైన వారికి రూ.15 వేలు ఇవ్వనున్నారు. జిల్లాలో పింఛన్ అందుకునే వారు మొత్తం రెండు లక్షల 38 వేల 321 మంది ఉండగా వారిలో వృద్ధులు లక్షా 29 వేల 344 మంది, వితంతువులు 49 వేల 801 మంది ఉన్నారు. ఒంటరి మహిళలు 6,979, వృత్తిదారులు (కల్లుగీత కార్మికులు, చేనేత వృత్తిదారులు, ఫిషర్ మ్యాన్స్) 21 వేల 664 మంది, అభయ హస్తం ద్వారా 8,838 మంది, కిడ్నీ లివర్ మార్పిడి, గుండె మార్పిడి రోగులు 30 మంది, పెరాలసిస్ వల్ల బెడ్ రిడెన్ పర్సన్స్ 1017 మంది, ట్రాన్స్ జెండర్స్ 34 మందితోపాటు డప్పు, వృద్ధ కళాకారులు పింఛన్ పొందుతున్నారు. వీరందరికి జూలై ఒకటో తేదీన పింఛన్‌ను అందించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

మా పెద్ద కొడుకు చంద్రబాబు : రాపాక లక్ష్మి

వృద్ధులు, వితంతువులు, వికలాంగులతో ప్రతి పింఛనుదారులకు టీడీపీ హయాంలో చంద్రబాబుతోనే రెండు వందల నుంచి వెయ్యి, తర్వాత రెండు వేలకు పింఛన్లు పెంచారు. ఇపుడు నాలుగు వేలకు పెంచి పింఛన్‌దారులు ఇంటికి పెద్ద కొడుకుగా చంద్రబాబు మారాడు.

49 గ్రామాల్లో.. ప్రత్యేక పారిశుధ్యం

ఆచంట, జూన్ 14 : జిల్లాలోని 49 గ్రామ పంచాయతీల్లో సోమవారం నుంచి 15 రోజులపాటు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నట్లు డీపీవో ఆర్.విక్టర్ అన్నారు. శుక్రవారం వల్లూరులో జరుగుతున్న పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. 'వర్షాకాలం దృష్ట్యా అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పారిశుధ్య పనులు చేపడుతున్నాం. ఎక్కడైనా పారిశుధ్య పనుల నిర్వహణలో అలసత్వం నిర్వహిస్తే చర్యలు తప్పవు. గ్రామాల్లో ప్లాస్టిక్ వస్తువులు సేకరించి, అమ్మగా వచ్చిన మొత్తంలో సగభాగం పారిశుధ్య కార్మికులకు ఇచ్చేలా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు' అని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి జీవీవీ సత్యనారాయణ, నేలపూడి రామ్మోహనరావు తదితరులున్నారు.

తల్లికి వందనం

- 2 లక్షల 15 వేల మంది విద్యార్థులకు లబ్ధి
- అప్పుడు రూ.13 వేలు ఇప్పుడు 15 వేలు
- కుటుంబంలో పిల్లలందరికి వర్తింపు
- హర్షం వ్యక్తం చేస్తున్న మహిళలు

భీమవరం రూరల్, జూన్ 14: పిల్లలను పాఠశాలకు పంపించినందుకు గాను విద్యార్థి తల్లి బ్యాంకు ఖాతాకు ఏడాదికి రూ.15 వేలు నగదు సాయాన్ని జమ చేస్తామని చెప్పిన వైసీపీ ప్రభుత్వం ఆ హామీని పూర్తి స్థాయిలో నిలబెట్టుకోలేకపోయింది. నగదులో రూ.2 వేలను స్కూల్ టాయిలెట్, మెయింటినెన్స్ ఖర్చుల కోసమంటూ మినహాయించుకుని మిగతా రూ.13 వేలను జమ చేసినా, సిక్స్ స్టెప్ వెరిఫికేషన్‌లో ఈ అమ్మ ఒడికి అనర్హులంటూ వేల సంఖ్యలోనే విద్యార్థుల తల్లులకు ఆర్థిక లబ్ధి దూరం చేసింది. రెండు లక్షల 25 వేల మంది విద్యార్థులకు గాను వైసీపీ సర్కార్ లక్షా 43 వేల మందినే అర్హులుగా గుర్తించింది. మిగిలిన 80 వేల మంది పిల్లలకు తల్లిదండ్రులు ఫీజులు చెల్లించాల్సి వచ్చింది. ఐదేళ్ళ కాలానికి అమ్మ ఒడి ఇస్తామన్న ప్రభుత్వం ఇటీవల గద్దె దిగే నాటికి నాలుగేళ్ళు మాత్రమే అమలు చేసింది. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం అమ్మ ఒడి నగదు సాయం పథకాన్ని పిల్లల సంఖ్యతో నిమిత్తం లేకుండా ఇంట్లో ఎంత మంది వున్నా ఒక్కొక్కరికి కోత లేకుండా రూ.15 వేలు ఇస్తామని ఎన్నికల హామీగా ప్రకటించింది. గత ఏడాది లెక్కల ప్రకారం.. జిల్లాలో 1,352 ప్రభుత్వ పాఠశాలల్లో లక్షా ఐదు వేల మంది విద్యార్థులు, 473 ప్రైవేటు పాఠశాలల్లో లక్షా పది వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ లెక్కన రెండు లక్షల 15 వేల మంది విద్యార్థులకు తల్లికి వందనం అందించాల్సి వుంది.



ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ బుద్దాల బ్లడ్ బ్యాంకులో శుక్రవారం రక్తదానం చేశారు. రక్తదానం ఆవశ్యకతను గుర్తించి ప్రతి ఒక్కరూ చేయాలని పిలుపునిచ్చారు. 104సార్లు రక్తదానం చేసిన రిపోర్టర్ రాజాను సన్మానించారు. - తణుకు

వరద ప్రాంతాల్లో ముందస్తు చర్యలకు ప్రణాళిక : జేసీ

భీమవరం టౌన్, జూన్ 14 : వరద ముంపు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టడానికి ప్రణాళికలను సిద్ధం చేయాలని జేసీ సీవీ ప్రవీణ్ ఆదిత్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఆయన ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో సమావేశమై అధిక వర్షాల కారణంగా గోదావరి పరివాహక ప్రాంతాల్లోని వరద ముంపు గ్రామాల్లో తగిన రక్షణ చర్యలు చేపట్టేందుకు ముందస్తు ప్రణాళికలపై చర్చించారు. పెనుగొండ, మొగల్తూరు, ఆచంట, నరసాపురం, యలమంచిలి మండలాల్లోని కొన్ని గ్రామాలు వరద ముంపునకు గురవుతోందని చెప్పారు. వర్షాకాలం సీజన్‌లో ఎంత వర్షం కురవవచ్చు, ఎన్ని క్యూసెక్కుల నీరు చేరవచ్చు అనే సమాచారాన్ని వాతావరణ శాఖ ముందస్తు అంచనాలను క్రోడీకరించి సిద్ధంగా ఉండాలన్నారు. భద్రాచలం నుంచి విడుదలయ్యే నీటిని అంచనాగా తీసుకుని ముందుగా ఏ మండలాల్లోని ఏయే గ్రామాలలో నీరు చేరవచ్చో ఆయా గ్రామాల్లో ముందస్తు చర్యలు తీసుకోవాలని చెప్పారు. పది లక్షల క్యూసెక్కుల నీరు వస్తే ఎన్ని గ్రామాలు ప్రభావితం అవుతాయి, 15 లక్షలు క్యూసెక్కుల నీరు వస్తే ఎన్ని గ్రామాలపై ప్రభావం ఉంటుందనేది ఒక అంచనాకు రావాలన్నారు. చిన్నగొల్లపాలెం వద్ద పరిస్థితులను మెరుగు పరచాలన్నారు. గట్లు బలహీనంగా ఉన్న ప్రాంతాలను ముందుగా గుర్తించి ఇసుక బస్తాలను సిద్ధం చేయాలన్నారు. సబ్ కలెక్టర్ ఎం.అచ్యుత్ అంబరీష్, కెనాల్స్ ఈఈ ఎం.దక్షిణామూర్తి తదితరులు పాల్గొన్నారు.

- ఇక జల ప్రవాహమే..!



పాలకొల్లు కాలువలో నీటి ప్రవాహానికి అడ్డుగా వున్న తూడు, చెత్తా చెదారాన్ని రైతులతో కలిసి తొలగిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు (ఫైల్)

నిమ్మల చేతికి జల వనరులు

- ప్రాధాన్యతా శాఖను కేటాయించిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- పోలవరం సహా పలు ప్రాజెక్టులకు మోక్షం
- ప్రజా సమస్యల పరిష్కారంలో రామానాయుడిది ప్రత్యేక శైలి

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడును జల వనరుల శాఖ మంత్రిగా నియమించారు. రాష్ట్రంలోనే అత్యంత ప్రాధాన్యత కలిగిన శాఖ నిమ్మలకు దక్కడంతో.. ఇక ఈ రంగంలో పనులు వేగవంతం అయ్యే అవకాశాలు ఉన్నాయి. గడచిన ఐదేళ్ల జగన్ సర్కార్ హయాంలో నీటిపారుదల శాఖ ప్రాజెక్ట్‌లన్నీ పడకేశాయి. రాష్ట్ర జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్ట్‌ను పట్టించుకోలేదు. కార్యదక్షత కలిగిన నిమ్మలకు జలవనరుల శాఖ కేటాయించడంతో అందరిలోనూ ఆశలు రేకెత్తాయి. పోలవరం ప్రాజెక్ట్ కొలిక్కి రానుంది. కేంద్ర సహకారం అందనుంది. ఉభయ గోదావరి జిల్లాలకు రబీ స్థిరీకరణ కావాలంటే ఈ ప్రాజెక్ట్ ఒక్కటే మార్గం. నిమ్మలకు జలవనరుల శాఖ కేటాయించడంతో ఇది పరుగులు తీస్తుందన్న నమ్మకం ఏర్పడింది. పనులు నిర్వహించడంలో నిత్యం అధికారులు వెంటపడడం నిమ్మల నైజం. పని అయ్యేంత వరకు అదే ధ్యాసతో ఉంటారు. వార్తల్లోనూ నిలుస్తుంటారు. పాలకొల్లుకు శ్మశాన వాటిక నిర్మాణానికి కాంట్రాక్టరు రాకపోవడంతో అక్కడే మూడు రోజులు నిద్రించారు. అపోహలను తొలగించారు. శ్మశాన వాటిక నిర్మించేలా చర్యలు తీసుకున్నారు. ఇలా పని విషయంలో పట్టుదలతో ఉంటారు. అందుకే జలవనరుల శాఖను చంద్రబాబు ఏరికోరి నిమ్మలకు కేటాయించారు.

పోలవరానికి మహర్దశ

పోలవరం ప్రాజెక్ట్ పూర్తయితే రాయలసీమ కూడా సస్య శ్యామలం కానుంది. విశాఖకు మంచినీరు అందించే అవ కాశం ఉంది. పరిశ్రమలకు ఆస్కారం ఉంటుంది. తాడి పూడి, చింతలపూడి ఎత్తిపోతల పథకాలు వైసీపీ ప్రభు త్వం పెండింగ్‌లో పెట్టింది. వాటికి మోక్షం లభించనుంది. ఈ రెండు ప్రాజెక్టులు పూర్తయితే మెట్ట ప్రాంతానికి గోదావరి జలాలు పూర్తిస్థాయిలో అందనున్నాయి. వాణిజ్య పంటలు మరింతగా విస్తరించనున్నాయి. నిమ్మలపై ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని పోలవరం, చింతలపూడి, తాడిపూడి ప్రాజెక్ట్‌లను పూర్తిచేయాల్సిన బాధ్యత పడింది. అభివృద్ధి విషయంలో నిధులు రాబట్టేందుకు నిమ్మల పోరాటం చేస్తుంటారు. ఇప్పుడు పూర్వ పశ్చిమ గోదావరి జిల్లాకు అవసరమైన ప్రాజెక్ట్‌లకు నిధులు రాబట్టడంలోనూ చొరవ చూపుతారన్న నమ్మకం జిల్లా ప్రజల్లో నెలకొంది. మరోవైపు డెల్టా ఆధునికీకరణ ముందడుగు వేయడం లేదు. కనీసం వేసవి పనులు చేపట్టడం లేదు. బిల్లులు మంజూరు చేయడం లేదు. వేసవి పనులకు దిక్కు లేకుండా పోయింది. ఇవన్నీ సక్రమంగా పూర్తి చేయడానికి అవకాశం ఏర్పడింది. జిల్లా అవసరాలను గుర్తించి డెల్టా ఆధునికీకరణకు పెద్దపీట వేయనున్నారు. వైసీపీ హయాంలో నీటి ప్రాజెక్టులకు పెద్దగా నిధులు కేటాయించలేదు. పోలవరం ప్రాజెక్ట్ కనీస నిర్మాణానికి నోచుకోలేదు. గత తెలుగుదేశం హయాంలో 72 శాతం పనులు పూర్తిచేశారు. వైసీపీలో ప్రాజెక్ట్‌ను పూర్తిగా విస్మరించారు. రైతు బిడ్డగా నిమ్మల వారి కష్టాలు, సాగునీటి ఇబ్బందులపై పూర్తి అవగాహన ఉండటంతో ఈ పదవికి పూర్తి న్యాయం జరుగుతుందని జిల్లావాసులు భావిస్తున్నారు.

తగ్గని విద్యుత్ వినియోగం



- రుతుపవనాలు వచ్చినా పెరుగుతున్న వినియోగం.. డిమాండ్
- తప్పని విద్యుత్ అంతరాయాలు
- వాతావరణ మార్పులే కారణమంటున్న నిపుణులు

ఏలూరుసిటీ, జూన్ 14 : ఓవైపు నైరుతి రుతుపవనాలు వచ్చాయంటున్నారు.. అయినా వాతావరణంలో ఎటువంటి మార్పులు లేకపోవడం.. మరోవైపు వర్షాలు మందగించడంతో విద్యుత్ వినియోగం పెరుగుతుందే తప్ప ఏ మాత్రం తగ్గడం లేదు. వారం రోజుల్లో ఉష్ణోగ్రతల ఆధారంగా కొన్ని రోజుల్లో విద్యుత్ కోటా కన్నా వినియోగం అధికంగా ఉంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో వర్షాలకు అనానుకూల పరిస్థితులు ఏర్పడడంతో ఉష్ణోగ్రతలు పెరుగుతూనే వస్తున్నాయి. విభిన్న వాతావరణం ఉండడంతో పగటి ఉష్ణోగ్రతలు 34 నుంచి 37 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు నమోదవుతున్నా.. ఎండ తీవ్రత ఏ మాత్రం తగ్గడం లేదు. ఉక్కపోత విపరీతంగా పెరగడంతో గృహ విద్యుత్ వినియోగం విపరీతంగా పెరుగుతోంది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ముందుగానే వచ్చినా వర్షాల జాడ మాత్రం అంతంత మాత్రంగానే కనిపిస్తోంది. ఈ పరిస్థితులలో విద్యుత్ వినియోగం పెరుగుతూనే ఉంది. విద్యుత్ కోటాకు విద్యుత్ డిమాండ్‌కు వ్యత్యాసం ఉండడంతో ఒక్కొక్కసారి విద్యుత్ అంతరాయాలు తప్పడం లేదు. ఈ పరిస్థితుల కారణంగాను, సాంకేతికంగా ఇబ్బందులు ఏర్పడిన సమయాల్లోనూ అప్రకటిత విద్యుత్ కోతలు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో అమలవుతూనే ఉన్నాయి. రాత్రి సమయాల్లో ఉక్కపోతను భరించలేక ప్రజలు సతమతమవుతున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఏసీలు, కూలర్ల వినియోగం యథాతథంగానే ఉంది. పగటిపూట ఉమ్మడి పశ్చిమలోని పలు ప్రాంతాల్లో మబ్బుల వాతావరణం ఉన్నా ఉష్ణోగ్రత తీవ్రత కనిపించడంతో విద్యుత్ వాడకం పెరుగుతూనే ఉంది.

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో విద్యుత్ వినియోగం ఇలా..

తేదీ	విద్యుత్ కోటా (మిలియన్ యూనిట్లలో)	విద్యుత్ వినియోగం (మిలియన్ యూనిట్లలో)
జూన్ 7	19.925	19.958
జూన్ 8	20.376	19.404
జూన్ 9	22.499	19.565
జూన్ 10	23.281	20.534
జూన్ 11	20.180	20.962
జూన్ 12	21.703	21.668
జూన్ 13	21.225	21.902

తప్పని విద్యుత్ అంతరాయాలు

జిల్లాల్లో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌తో విద్యుత్ అంతరాయాలు కూడా పెరుగుతూనే ఉన్నాయి. పగటి పూట ఉష్ణోగ్రతల తీవ్రత కారణంగా విద్యుత్ కోటా విడుదల చేసినా వినియోగం పెరుగుతూనే ఉంది. విద్యుత్ అంతరాయాలు ఏర్పడిన సమయంలో మాత్రం విద్యుత్ కోటా కంటే తక్కువగా విద్యుత్ వినియోగం జరుగుతోంది. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు తరచూ మొరాయిస్తుండడంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయాలు ఏర్పడుతున్నాయని చెబుతున్నారు. ఈదురుగాలులు ఎక్కువగా వీచిన ప్రాంతాల్లో గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

జూన్‌లోనూ తగ్గని వినియోగం..

సాధారణంగా జూన్‌లో వర్షాలు కురవడం ఆరంభించిన తర్వాత విద్యుత్ వినియోగం తగ్గుతూనే ఉంటుంది. కాని ప్రస్తుతం ఆ పరిస్థితులు ఎక్కడా కనిపించడం లేదు. వర్షాలు అంతంత మాత్రంగానే ఉండడంతో జూన్ మూడో వారంలోకి అడుగిడినా విద్యుత్ వినియోగం అసాధారణంగానే ఉంది. ఇప్పటికైనా రుతుపవనాలు ప్రభావం కారణంగా వర్షాలు కురిస్తే విద్యుత్ వినియోగం తగ్గే అవకాశాలున్నాయి.

మలేషియాలో టీడీపీ సంబరాలు



ఆచంట, జూన్ 14 : ఆచంట మండలానికి చెందిన కొంతమంది టీడీపీ శ్రేణులు రెండు రోజులు క్రితం మలేషియా వెళ్లారు. అక్కడ ఉన్న ప్రపంచంలోనే ఎత్తైన రెండో టవర్ వద్ద కూటమి విజయం సందర్భంగా అక్కడ తెలుగు వారితో కలిసి టవర్ వద్ద టీడీపీ జెండా పట్టుకుని పెద్దఎత్తున సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో గుడాల శ్రీనివాస్, గంజా శ్రీనివాస్ పాల్గొన్నారు.

వచ్చే వారం మాధవాయిపాలెం రేవు పాట !

- నేడు జేఏసీ సమావేశంలో నిర్ణయం



నరసాపురం రూరల్, జూన్ 14: మాధవాయిపాలెం రేవు పాటను వచ్చే వారం నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మేరకు శనివారం జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశాన్ని నిర్వహించి నిర్ణయం తీసుకోనున్నారు. ఎన్నికల కోడ్ కారణంగా 2024-25 ఆర్థిక సంవత్సరం రేవు పాటను నిర్వహించలేదు. ఏప్రిల్ నుంచి పాత పాటదారుడే రోజువారీ పద్ధతిలో రేవును నిర్వహిస్తూ వస్తున్నారు. కోడ్ ముగియడంతో జిల్లా అధికారులు పాటకు పచ్చజెండా ఊపారు. ప్రారంభ ధర రూ.2.75 కోట్లుగా నిర్ణయించారు. జేఏసీ కమిటీ ఆమోదం తెలపగానే సోమవారం నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. మరోవైపు రోజువారీ పద్ధతిలో రేవు నిర్వహణను చేపడుతున్న పాటదారుడు పెద్దమొత్తంలో బకాయి పడ్డారు, సుమారు రూ.25 లక్షలపైనే బకాయి ఉన్నట్లు, అతడికి నోటీసులు జారీ చేశామని ఎంపీడీవో రమణారావు తెలిపారు. దీనిపై కూడా శనివారం జరిగే జేఏసీ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామన్నారు.

వీఆర్వోల సమస్యలు రెవెన్యూ మంత్రికి తెలుపుతాం

ఏలూరు రూరల్, జూన్ 14 :వీఆర్వోల సమస్యలను రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ దృష్టికి తీసుకువెళతామని ఏపీ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్ర రాజు, ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలనాయుడు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర కమిటీ పక్షాన రెవెన్యూ మంత్రిగా బాధ్యతలు స్వీకరించబోతున్న సత్యప్రసాద్‌కు అభినందనలు తెలిపారు. డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖమంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తున్న పవన్‌కల్యాణ్, లోకేశ్, వంగలపూడి అనిత, నిమ్మల రామానాయుడు తదితరశాఖల మంత్రులకు సంఘం తరఫున కృతజ్ఞతలు తెలిపారు

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

కలిదిండి, జూన్ 14 : కాళ్లపాలేనికి చెందిన అల్లాడి నాగరాజు ఇల్లు శుక్రవారం షార్ట్ సర్క్యూట్‌తో అగ్నికి ఆహుతైంది. ఇంట్లో వస్తు సామగ్రి, దుస్తులు, రేషన్, ఆధార్ కార్డులు, నగదు కాలి బూడిదయ్యాయి. సుమారు రూ.3 లక్షల ఆస్తినష్టం వాటిల్లి బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. కైకలూరు ఫైరింజన్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. తహసీల్దార్ దశిక వంశీ, వీఆర్వో కోకా చంద్రశేఖర్ బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు..

తిరోగమనంలో ఏపీ నిట్



డైరెక్టర్‌గా చేరేందుకు డాక్టర్ దిలీప్ విముఖత

- సీట్ల కుదింపు.. ఎంటెక్ కోర్సుల నిలిపివేత
- వైసీపీ ప్రభుత్వ పాలనలో నిధులు అంతంత మాత్రమే

(భీమవరం-ఆంధ్రజ్యోతి) :

తాడేపల్లిగూడెం ఆంధ్రప్రదేశ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి కష్టకాలం దాపురించింది. సీట్లలో కోత పడింది. ఎంటెక్ కోర్సులు నిలిపివేశారు. రెగ్యులర్ డైరెక్టర్ డాక్టర్ సీఎస్పీ రావును తొలగించినప్పటి నుంచి ఏపీనిట్‌ను పట్టించుకున్న వారు లేరు. వైసీపీ ప్రభుత్వం దీనిపై కనీస శ్రద్ధ చూపలేదు. రెండేళ్ల క్రితం ఏపీనిట్ సీట్ల సంఖ్య 700కు చేరింది. ఆ తర్వాత సరిపడా ఫ్యాకల్టీ లేరంటూ సీట్ల సంఖ్యను 480కి కుదించారు. డైరెక్టర్‌గా సూర్యప్రకాశ్‌రావు ఉన్నప్పుడు కేంద్రంతో సంప్రదింపులు జరిపారు. సీట్ల సంఖ్యను పెంచారు. అడ్మిషన్‌లు కల్పించారు. ఆయనపై సీబీఐ కేసు నమోదు కావడంతో పక్కన పెట్టారు. ఆ తర్వాత కమిటీ వేసి ప్రత్యేక దర్యాప్తు చేశారు. జాతీయ స్థాయికి అనుకుగుణంగా డాక్టర్ సూర్యప్రకాశ్ రావు వ్యవహరించలేదంటూ డైరెక్టర్ బాధ్యతల నుంచి తొలగించారు. సకాలంలో కొత్త డైరెక్టర్‌ను నియమించలేదు. నాగపూర్ నిట్ డైరెక్టర్ డాక్టర్ పడోలేను ఏపీనిట్‌కు ఇన్‌చార్జిగా నియమించారు. డాక్టర్ పడోలే పదవీ కాలం ముగియడంతో ప్రస్తుతం హైదరాబాద్ ఐఐటీ డైరెక్టర్ డాక్టర్ బీఎస్ మూర్తి ఏపీనిట్‌కు ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. ఎన్నికల ముందు నాగపూర్ నిట్ ప్రొఫెసర్ డాక్టర్ దిలీప్ ఆర్ పేస్వీని ఏపీనిట్ డైరెక్టర్‌గా కేంద్ర ప్రభుత్వం నియమించింది. కేంద్ర ప్రభుత్వం జూన్ 8వ తేదీకి గడువు విధించింది. అప్పటిలోగా ఏపీనిట్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించాలని డాక్టర్ దిలీప్‌కు కేంద్రం సూచించింది. డైరెక్టర్‌గా కేంద్రం నియమించిన తర్వాత డాక్టర్ దిలీప్ ఏపీనిట్‌ను సందర్శించారు. ఆ తర్వాత తన మనసు మార్చుకున్నారు. డైరెక్టర్ బాధ్యతలు స్వీకరించలేదు. డైరెక్టర్ బాధ్యతలపై ఆసక్తి లేదంటూ డాక్టర్ దిలీప్ కేంద్రానికి స్పష్టం చేశారు. ప్రస్తుతం హైదరాబాద్ ఐఐటీ డైరెక్టర్ డాక్టర్ బీఎస్ మూర్తి ఇన్‌చార్జ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. ఇన్‌చార్జ్‌ల పాలనలో నిట్ తిరోగమనంలో పయనిస్తోంది.

ఐదేళ్లపాటు పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం

తాడేపల్లిగూడెంలో ఏపీ నిట్ 2015లో ప్రారంభమైంది. దేశంలో ఏ నిట్‌కైనా ప్రారంభ దశలో 120 సీట్లు కేటాయిస్తారు. తాడేపల్లిగూడెంలో ఏపీనిట్‌కు మాత్రం అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం కృషితో కేంద్రం 480 సీట్లు కేటాయించింది. రాష్ట్ర విభజనతో ఏపీ విద్యార్థులు నష్టపోకూడదని కేంద్రం అంగీకరించింది. మొదటి ఏడాదే 480 సీట్లకు అడ్మిషన్లు కల్పించారు. శాశ్వత క్యాంపస్ కూడా తెలుగుదేశం హయాంలోనే ఏర్పాటు చేశారు. నిత్యం కేంద్రంతో సంప్రదింపులు జరిపి నిధులు రాబట్టారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ధ్యాసే లేకుండా పోయింది. ఆర్థికంగా వెనుక బడిన తరగతులకు పది శాతం కోటాను కేంద్రం అమలు చేయడంతో ఏపీనిట్‌కు అదనపు సీట్లు వచ్చాయి. తొలుత కేంద్రం ఏపీ నిట్‌లో ఈడబ్ల్యూఎస్ కోటాలో సీట్లు పెంచేందుకు అంగీకరించలేదు. అప్పటి డైరెక్టర్ డాక్టర్ సూర్యప్రకాశ్‌రావు చొరవతో సీట్లు పెంపునకు అంగీకరించింది. మొత్తంపైన 700 సీట్లకు ఏపీ నిట్ చేరుకుంది. ప్లేస్‌మెంట్స్‌లోనూ దేశంలోనే నంబర్ టూ స్థానానికి ఎదిగింది. డైరెక్టర్‌ను తప్పించిన తర్వాత ఇన్‌చార్జ్‌లు వచ్చారు. ఏపీ నిట్‌పై దృష్టి పెట్టలేకపోయారు. రాష్ట్ర ప్రభుత్వం పట్టించు కోలేదు. ఫ్యాకల్టీని నియమించలేదు. వసతి సౌకర్యాలను పెంచలేదు. చివరకు సీట్లను కుదించేశారు.

తగ్గిన సీట్ల సంఖ్య..

సీట్ల సంఖ్య 700 నుంచి 480కి తగ్గిపోయింది. ఈ ఏడాది 480 సీట్లకు అడ్మిషన్‌లు కల్పించనున్నట్టు ఏపీనిట్ అధికారులు ప్రకటించారు. గతలో 700 సీట్లు ఉన్నప్పుడు రాష్ట్ర విద్యార్థులకు 350 సీట్లు లభించేవి. మిగలిన 50 శాతం సీట్లను ఇతర రాష్ట్ర విద్యార్థులతో భర్తీ చేసేవారు. జేఈఈలో మంచి ర్యాంకు సాధించిన విద్యార్థులు ఏపీ నిట్‌లో చేరేందుకు ఆసక్తి చూపేవారు. ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. గతంలో దక్షిణాదిలోనే నంబర్ వన్ విద్యా సంస్థగా అవార్డు అందుకుంది. ఆ రికార్డులన్నీ ఇప్పుడు చెదిరిపోయాయి.

ఎంటెక్ కోర్సులు నిలిపివేత

గతంలో ఎంటెక్ కోర్సులను అమలు చేశారు. కేంద్రం అనుమతి తీసుకుని దాదాపు ఎనిమిది కోర్సుల్లో ప్రవేశాలు కల్పించారు. ఇప్పుడు వాటిని కూడా ఎత్తివేశారు. ఇలా ఏపీనిట్ అంతా వెనుకడుగు వేస్తోంది. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఏపీ నిట్‌పై దృష్టి పెట్టాల్సి ఉంది. ఏపీనిట్‌లో రాజకీయ జోక్యం కూడా ఎక్కువగా ఉంటోంది. అది లేకుండా నివారించాలి. నిధులు రాబట్టాలి. వైసీపీ హయాంలో అంతంత మాత్రంగానే నిధులు ఇచ్చారు. అదనపు వసతులు కల్పించాలన్నా.. అకడమిక్ భవనాలు ఏర్పాటు చేయాలన్నా నిధులు అవసరం కానున్నాయి. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టినప్పుడే సాధ్యమవుతుంది. ప్రస్తుతం 172 ఎకరాల్లో ఏపీనిట్ విస్తరించి ఉంది. మరో 40 ఎకరాలు అవసరం కానున్నాయి. ఏపీ నిట్ ప్రతిపాదించింది. దానిని కూడా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం దానిపైనా చర్యలు తీసుకోవాలి. అప్పుడే ఏపీ నిట్‌కు మళ్లీ పూర్వవైభవం వస్తుంది.

తగ్గిన ప్లేస్‌మెంట్స్

రెగ్యులర్ డైరెక్టర్ ఉంటే ప్లేస్‌మెంట్స్ వస్తాయి. కంపెనీలు ఆసక్తి చూపుతుంటాయి. ప్రస్తుతం ఇన్‌చార్జ్ అధికారులున్నారు. ప్లేస్‌మెంట్స్‌లోనూ ఏపీ నిట్ స్థానం పడిపోయింది. గతంలో వంద శాతం ప్లేస్‌మెంట్స్ సాధించే స్థాయికి ఎదిగింది. ఇప్పుడు 75 శాతం సాధించడం కష్టమైపోతోంది. రెగ్యులర్ ఫ్యాకల్టీని నియమించడంలోనూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి చేయలేకపోయింది. ప్రస్తుతం 75 మంది రెగ్యులర్ ఫ్యాకల్టీలు ఉన్నారు. మిగిలిన వారంతా కాంట్రాక్ట్ పద్ధతిలో ఉన్నారు. ఫ్యాకల్టీ కారణాన్ని చూపి సీట్లను తగ్గించేశారు.

గోవు పవిత్రమైనది.. వధించడం నేరం

భీమవరంటౌన్, జూన్ 14 :గోవు పవిత్రమైనదని, సాధు జంతువని అటువంటి గోవును వధించడం చట్టరీత్యా నేరమని, బక్రీద్ సందర్భంగా జంతుబలులు నిషేధించేలా ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని జిల్లా పశుసంవర్థక శాఖ జాయింట్ డైరెక్టర్ కె.మురళీకృష్ణ తెలిపారు. శుక్రవారం జిల్లా జంతు సంరక్షణ సంఘం జిల్లా పశుసంవర్థక శాఖ, జిల్లా రవాణా శాఖ విద్యాశాఖ, దిశ పోలీస్ శాఖల ఆధ్వర్యంలో 'గోహత్య చట్టరీత్యా నేరం గోహత్యను మానండి' అంటూ అవగాహన ర్యాలీ, కరపత్రాల పంపిణీ జంతు సంరక్షణ ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించారు. డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జాఫర్ హుస్సేన్, జిల్లా జంతు సంక్షేమ సంఘం నోడల్ ఆఫీసర్ డాక్టర్ సత్యనారాయణ జంతు బలుల నిషేధంపై ప్రభుత్వ శిక్షలను వివరించారు. దిశా చట్టం డీఎస్పీ వి.మురళీకృష్ణ, మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ ఎం.రవికుమార్ మాట్లాడుతూ బక్రీద్ సందర్భంగా ఎవరైనా గోవులను, జంతువులను వధిస్తే ప్రభుత్వ శిక్షలకు శిక్షార్హులని, కఠినమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. జిల్లా జంతు సంరక్షణ సమితి చెరుకువాడ రంగసాయి జంతు సంరక్షణ ప్రతిజ్ఞ నిర్వహించారు. సుంకర దాసు, నరహరిశెట్టి కృష్ణ, పశుసంవర్థక శాఖ సిబ్బంది, ఎం.సుధారాణి తదితర శాఖల వారు పాల్గొన్నారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు.



గోహత్య నివారిస్తామంటూ ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం


గోవుల అక్రమ రవాణా చట్టవిరుద్ధం

- పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల

భీమవరం క్రైం, జూన్ 14 : బక్రీద్ పండుగ ఈనెల 17వ తేదీ సందర్భంగా జిల్లాలో ఎవరైనా గోవులను, దూడలను అక్రమ రవాణా చేయడం, వధించడంగాని చేస్తే చట్టపరమైన కఠినచర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ పోలీసువారి ఆదేశాలకు విరుద్ధంగా వ్యవహరిస్తే గోవధ, జంతు సంరక్షణ చట్టం 1977, జంతు రవాణా నియమాలు, స్లాటర్ హౌస్ రూల్స్ ప్రకారం తీవ్రమైన చర్యలు తీసుకొంటామన్నారు. జంతు సంరక్షణకు సంబంధించి పశ్చిమ గోదావరి జిల్లా ప్రత్యేక పర్యవేక్షకుడిగా, నోడల్ ఆఫీసర్‌గా భీమవరం దిశ డీఎస్పీ ఎస్.మురళీకృష్ణని నియమించామన్నారు.

ఆ రెవెన్యూ అధికారి రూటేవేరు

- ప్రతి పనికి ఓ రేటు.. ప్రైవేట్ వ్యక్తితో వసూళ్లు



నరసాపురం, జూన్ 14: జిల్లాలోని ఓ తహసీల్దార్ కార్యాలయంలోని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వసూళ్లకు అడ్డూఅదుపూ లేకుండా పోతుంది. ప్రతి పనికి ఓ రేటు ఫిక్స్ చేశారు. పనికి ముందు కొంత, అయిన తరువాత మరికొంత చెల్లించాల్సిందే, అది కూడా చేతికి అంటకుండా ప్రైవేట్ వ్యక్తి ద్వారా వసూళ్లకు పాల్పడుతున్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ నుంచి ఈ కార్యాలయంలో సాగుతున్న వసూళ్లపై తీవ్ర చర్చ సాగుతోంది. అధికారులు, సిబ్బంది మారి కొత్తవారు వచ్చినా ఇదే తంతు. ఫ్యామిలీ సర్టిఫికెట్, జనన, మరణ, పట్టాదారీ పాస్ పుస్తకాలు, అనధికార లే-అవుట్‌కు సంబంధించి ఒక రేటు ఫిక్స్ చేశారు. ఎవరైనా సరే ఆ సొమ్ము చెల్లించాల్సిందే, లేక పోతే పని పెండింగ్ పడుతుంది. ఈ కార్యాలయంలో పనంటే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. గతంలో అధికార పార్టీకి చెందిన కొందరు నేతల అండదండలు ఉండడంతో ఈ అధికారిదే ఇష్టారాజ్యంగా సాగింది. ప్రస్తుతం ప్రభుత్వం మారినా.. ఈ అధికారి తీరు మారకపోవడం గమనార్హం. మరోవైపు కొత్త ప్రభుత్వంలోనూ ఇక్కడే కొనసాగిందుకు ఈ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రయత్నాలు మొదలుపెట్టినట్టు తెలియవచ్చింది.

క్రైం కార్నర్

మనస్తాపంతో ఎలక్ట్రీషియన్ ఆత్మహత్య



సందీప్(ఫైల్)

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 14: మద్యానికి బానిసై, కుటుంబానికి దూరమైన ఓ వ్యక్తి మనస్తాపంతో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తాడేపల్లిగూడెంలో శుక్రవారం జరిగింది. రైల్వే అధికారులు తెలిపిన వివరాలివి.. యాగర్లపల్లికి చెందిన జి.సందీప్(25) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తుంటాడు. అతడికి వివాహమైన మూడు నెలలకే భార్యతో గొడవలు కావడంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటినుంచి మరింత ఎక్కువగా మద్యానికి బానిసై జీవితంపై విరక్తి పెంచుకున్నాడు. కడకట్లలోని రైలు పట్టాలపై పడుకుని ఆత్మహత్య ప్రయత్నం చేయగా ఆ సమయంలో వచ్చిన రైలు కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు రైల్వే ఎస్‌ఐ జి. శ్రీహరిబాబు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఉంగుటూరు, జూన్ 14 : ఉంగుటూరు శివారులో గురువారం జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. కాలకృత్యాల నిమిత్తం రోడ్డు పక్కన ఆగి వున్న లారీని భీమడోలు మండలం కురెళ్లగూడెం గ్రామానికి చెందిన దుగ్గిరాల లక్ష్మణరావు (55) మోపెడ్ బైక్‌తో ఢీకొట్టిన విషయం తెలిసిందే. అతడి భార్య బేబిరాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని చేబ్రోలు పోలీసులు తెలిపారు. మృత దేహానికి పోస్టుమార్టం నిర్వహించి వారి కుటుంబానికి అప్పగించినట్లు చేబ్రోలు పోలీసులు తెలిపారు.

మైనర్ల వివాహం కేసులో ఇద్దరి అరెస్ట్

ఏలూరు క్రైం, జూన్ 14 : మైనర్లకు వివాహం చేసిన కేసులో ఇద్దరిని ఏలూరు మండలం సీఐ ఎన్.రాజశేఖరరెడ్డి, రూరల్ ఎస్‌ఐ కె.రాజారెడ్డి అరెస్టు చేశారు. ఏలూరు రూరల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్లు ఇద్దరు ప్రేమించుకుని వివాహేతర సంబంధం కొనసాగించారు. ఆ బాలిక రెండో నెల గర్భం దాల్చడంతో తల్లిదండ్రులు ఇరువురు 2023 ఆగస్టు 26న వివాహం చేయడానికి ప్రయత్నించగా ఐసీడీఎస్ అధికారులు అడ్డుకుని వారిని బైండోవర్ చేశారు. అయితే అదేనెల 29వ తేదీన వివాహం జరిపేశారు. ఈ ఘటనపై ఐసీడీఎస్ అధికారులు ఏలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఇరువైపులా తల్లిదండ్రులతోపాటు పలువురిపై కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు 4వ, 5వ నిందితులను అరెస్టు చేశారు. అరెస్టయిన నిందితులను కోర్టుకు హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించారు.



గొల్లలకోడేరులో స్థలం వద్ద గుమిగూడిన జనం, పడగొట్టిన ప్రహరీ

గొల్లలకోడేరులో స్థల వివాదం

- ఇరువర్గాల మధ్య ఘర్షణ.. పోలీసుల జోక్యంతో తగ్గిన ఉద్రిక్తత

పాలకోడేరు, జూన్ 14: గొల్లలకోడేరు గ్రామంలోని సంజనా ఎస్టేట్ వద్ద కోట్లు విలువ చేసే స్థలానికి సంబంధించి శుక్రవారం రెండు వర్గాల మధ్య వివాదం చెలరేగి ఉద్రిక్తతకు దారి తీసింది. పాలకోడేరు ఎస్‌ఐ నాళం శ్రీనివాసరావు సిబ్బందితో కలిసి వెళ్లి ఇరువర్గాలను వివాద స్థలం నుంచి పంపించివేయడంతో గొడవ సర్దుమనిగింది. గ్రామంలోని సంజనా అపార్ట్‌మెం ట్ సమీపంలో సుమారు ఎనిమిది ఎకరాల స్థలాన్ని ఒక బ్యాంకు నుంచి వేలంపాటలో ముగ్గురు వ్యక్తులు దక్కించుకున్నారు. కానీ స్థల యాజమానులు కోర్టుకు వెళ్లడంతో అప్పటి నుంచి వివాదం నడుస్తూనే ఉంది. ఈ నేపథ్యంలో బ్యాంకు నుంచి వేలం పాటలో దక్కించుకున్న వ్యక్తులు కొంతమంది అనుచరులతో వెళ్ళి ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నం చేసి స్థలానికి అడ్డుగా ఉన్న ప్రహరీని కూల్చివేశారు. స్థల యాజమానులు వారి అనుచరులతో వచ్చి అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదంతో పాటు కొట్టుకునేందుకు సిద్ధపడ్డారు. ఓ వర్గం కర్రలతో రావడంతో వెనకడుగు వేయడంతో కొట్లాట తప్పింది. మధ్యలో పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాలతో చర్చించి సమస్యను పరిష్కరించేందుకు చూశారు. ఇరువర్గాలు అంగీకరించడంతో ఉద్రిక్తత తగ్గింది. ముందస్తులో భాగంగా పోలీసులు ఆ వివాద స్థలం వద్ద పికెటింగ్ ఏర్పాటు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

శేషాచలంపై అదుపుతప్పిన భక్తుడి కారు

- ధ్వంసమైన డివైడర్, కారు ముందుభాగం
- తప్పిన ప్రమాదం



ద్వారకాతిరుమల, జూన్ 14: శ్రీవారి దర్శనార్థం క్షేత్రానికి వచ్చిన ఓ భక్తుడి కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. నిత్యం భక్తులతో రద్దీగా ఉండే ప్రాంతంలో ప్రమాదం జరిగే సమయంలో భక్తులు ఎవరూ లేకపో వడంతో పెనుప్రమాదం తప్పింది. ఈఘటన శేషాచలంపై ఉన్న శేషాద్రి గెస్ట్ హౌస్ వద్ద శుక్రవారం సాయంత్రం జరిగింది. వివరాలివి.. జంగారెడ్డిగూడెంకు చెందిన భక్తులు కారులో క్షేత్రానికి వచ్చి స్వామిని దర్శించి అనంతరం కొండపై ఫొటోషూట్ చేసుకునేందుకు ఆ ప్రాంతానికి వెళ్లారు, కారును వేసుకు రమ్మని ఓ వ్యక్తిని పురమాయించగా అతను యాక్సిలేటర్ నుంచి కాలు తీయకపోవడంతో కారు వేగంగా వెళ్లి డివైడర్‌ను ఢీకొట్టింది. డివైడర్‌తో పాటు కారు సైతం పాక్షికంగా ధ్వంసమైంది.

పోక్సో కేసులో ఒకరి అరెస్ట్

అత్తిలి, జూన్ 14 : అత్తిలి మండలం స్కిన్నెరపురం గ్రామానికి చెందిన పసుపులేటి ఏసురాజు మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను అత్యాచారం చేశాడనే ఆరోపణపై అరెస్టు చేశామని అత్తిలి ఎస్‌ఐ రాంబాబు తెలిపారు. ఆరేళ్ల మైనర్ ఆడుకుంటున్న సమయంలో ఇంట్లోకి తీసుకువెళ్ళి అత్యాచారం చేసినట్టు తెలిపారు. బాలికకు కడుపులో నొప్పి వస్తుందని చెప్పడంతో తల్లి తెలుసుకుని అత్తిలి పోలీసులకు ఈనెల 9న ఫిర్యాదు చేసింది. దీనిపై తాడేపల్లిగూడెం డీఎస్పీ పీఎస్ఆర్ వీఎస్ మూర్తి పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తణుకు రూరల్ సీఐ జీవీవీ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్‌ఐ వి.రాంబాబు నిందితుడిని అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్ నిమిత్తం తణుకు కోర్టులో హాజరుపర్చారు.

పేదల ఆకలి తీర్చిన చంద్రబాబు కోసం

- వెయ్యి మందికి సప్తగిరి హోటల్ యజమానుల అన్నదానం



అన్నదానం చేస్తున్న హోటల్ యజమానులు

లింగపాలెం, జూన్ 14: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు గెలుపు పేదలకు వరమని, రూ.5లకే అన్న క్యాంటీన్‌లతో వేలాది మంది పేదల ఆకలి తీర్చారని హోటల్ యజమాని చెన్ను కొండలరావు, సోదరుడు చెన్ను శ్రీనివాసయాదవ్ తెలిపారు. లింగపాలెంలోని సప్తగిరి హోటల్ యజమానులైన వారు తమ హోటల్‌లో శుక్రవారం వెయ్యిమందికి పైగా ఉచితంగా అన్నదానం చేశారు. చంద్రబాబు ప్రమాణస్వీకారం సందర్భంగా కుటుంబ సభ్యులతో కలసి అన్నదానం చేసినట్టు వారు తెలిపారు.

సమాజానికి 'వేస్ట్ వెల్త్ ప్రాజెక్టు' ప్రయోజనకరం



ప్రాజెక్టు పత్రాలు అందిస్తున్న వీసీ జానకీరామ్

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 14 : సమాజానికి శ్రేయస్సు కలిగించే వేస్ట్ వెల్త్ (ఉద్యాన వ్యర్థాల నుంచి సందప తయారీ) ప్రాజెక్టు ప్రయోజనకరమని ఉద్యాన విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ టి.జానకీరామ్ పేర్కొన్నారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి సహకారంతో గోదావరి క్లస్టర్ యూనివర్సిటీల ద్వారా తగిన సాంకేతికత అభివృద్ధి చేసేందుకు డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం, ఏపీ ఎన్ఐటీ, ఆదికవి నన్నయ్య యూనివర్సిటీలు కలిసి చేపట్టనున్న ఈ ప్రాజెక్టు పత్రాలను ఆయన శుక్రవారం బాధ్యులకు అందించి మాట్లాడారు. రూ.10 లక్షల వ్యయంతో నిర్వహిం చేందుకు ఈ ప్రాజెక్టు ఎంపిక అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఇన్వెస్టిగేటర్ ప్రొఫెసర్ డాక్టర్ సులోమి సునీత, ఏపీ ఎన్ఐటీ ప్రొఫెసర్ డాక్టర్ టి.జగన్‌మోహనరావు, నన్నయ్య విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ డాక్టర్ టి.విజయనిర్మల ప్రాజెక్టు పత్రాలు అందుకున్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు, అధికారులు డీవీ స్వామి, ఎస్.సూర్యకుమారి పాల్గొన్నారు.

శ్రీవారికి ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ పూజలు



శ్రీవారి చిత్రపటాన్ని అందుకుంటున్న ఎంపీ మహేష్‌కుమార్

ద్వారకాతిరుమల, జూన్ 14: చినవెంకన్న ఆలయాన్ని ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్ శుక్రవారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు దేవస్థానం మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. తొలుత ఆయన బంగారువాకిలి మీదుగా లోనికి వెళ్లి స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేకపూజలు జరుపుకున్నారు. ఆలయ ముఖమండపంలో అర్చకులు ఆయనకు స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి వేదాశీర్వచనాన్ని అందించారు. ఆలయ ఈవో వి.త్రినాథరావు స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందించారు. టీడీపీ నేతలు ఇమ్మడి రత్నాజీ, కూరాకుల బుజ్జి యాదవ్, రేపూరి వెంకటేశ్వరరావు, నందిగం బాబి పాల్గొన్నారు.

విచ్చలవిడిగా కోళ్ల వ్యర్థాలు

చేపల చెరువులకు మేతగా తరలింపు.. పట్టించుకోని అధికారులు



భీమడోలు శివారు బోదెలో పడిన కోళ్ల వ్యర్థాలను వ్యానులోకి ఎక్కిస్తున్న దృశ్యం (ఫైల్)

భీమడోలు, జూన్ 14 : భీమడోలు మండలంలోని చేపల చెరువులకు కోళ్ళ వ్యర్థాల వినియోగం విచ్చలవిడిగా మారింది. మండల వ్యాప్తంగా ఉన్న చేపల చెరువులకు మేతగా కోళ్ల వ్యర్థాలను యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. భీమడోలు, కురెళ్ళగూడెం, అంబర్‌పేట, కొల్లేరు గ్రామాలకు రోజుకు పది నుంచి పదిహేను వాహనాల ద్వారా నిత్యం ఈ వ్యర్థాలను తరలిస్తున్నారు. మండలంలోని వైసీపీకి చెందిన మండల ప్రజా పరిషత్ ప్రతినిధి కనుసన్నల్లో వ్యర్థాలు తరలిస్తున్నట్టు సమాచారం. హోం గార్డు నుంచి జిల్లాస్థాయి అధికారుల వరకు వ్యర్థాల తరలింపునకు ఒకొక్కరికి ఒక్కోవిధంగా ముడుపులు నెలవారీ అందజేస్తున్నట్లు తెలిసింది. చేపల మేతకు కోళ్ల వ్యర్థాల వినియోగం నిషేధమైనప్పటికీ యథేచ్ఛగా పట్టపగలు తరలించేస్తున్నారు. అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యర్థాలు తరలించే సమయంలో అదుపు తప్పి పంట పొలాలు, బోదెలలో పడి దుర్గంధం వ్యాపిస్తున్నప్పటికీ సంబంధిత రైతులు, వాహనదారులపై చర్యలు మాత్రం శూన్యం. ఈ వ్యర్థాల తరలింపుపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

నేటి నుంచి లక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవం



పాలకొల్లు అర్బన్, జూన్14 : స్థానిక హౌసింగ్ బోర్డు ఏపీఎస్ కాలనీలోని శ్రీ లక్ష్మీ గణపతి ఆలయం 19వ వార్షికోత్సవం ఈనెల 15వ తేదీ నుంచి 19 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈసందర్భంగా శ్రీసిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామివార్లకు పాంచాహ్నిక కల్యాణం నిర్వహిస్తామని తెలిపారు. 16వ తేదీ రాత్రి స్వామివార్ల కల్యాణం రంగ రంగ వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు.

అన్న సమారాధన



మావుళ్ళమ్మ అమ్మవారు

పాలకొల్లు అర్బన్, జూన్ 14: స్థానిక 30వ వార్డులో గ్రామ దేవత మావుళ్ళమ్మ జాతర సందర్భంగా శుక్రవారం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు. గత నెల 23వ తేదీ నుంచి 25 వరకు జాతర ఉత్సవాలు నిర్వహించారు. దీనిలో భాగంగా ఆలయం వద్ద 5వేల మందికి అన్న సమారాధన నిర్వహించారు.

వేడుకగా ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పెనుగొండ, జూన్ 14: దేవ గ్రామంలో బాలా పార్వతి దేవి, చంద్ర శేఖర స్వామి వార్ల ఆలయ తృతీయ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వెలిచేటి బాబూ రాజేంద్ర ప్రసాద్, వరలక్ష్మి, వెలిచేటి లక్ష్మి వెంకట శ్రీనివాస్, లేల కల్యాణి దంపతులచే హోమాలు, అభిషేకాలు, లక్ష కుంకు మార్చనలు నిర్వహించారు. అనంతరం వార్షికోత్సవం పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన నిర్వహించారు.

వాసవీమాతకు తెలంగాణ భక్తుల పూజలు

పెనుగొండ, జూన్ 14: పెనుగొండ వాసవి శాంతి ధామ్‌లో శుక్రవారం తెలంగాణ రాష్ట్రం నుంచి వచ్చిన భక్తులు గోపూజ, అమ్మవారికి ప్రత్యేక పూజలు అనంతరం దంపతులతో వాసవి హోమం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఐదు హామీల అమలుతో హర్షం



విలేకర్లతో మాట్లాడుతున్న పొత్తూరి రామరాజు

నరసాపురం టౌన్, జూన్ 14: ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు అనుగుణంగా బాధ్యతలు చేపట్టగానే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఐదు హామీలు అమలు చేయడంతో ప్రజల్లో ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయని టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ మెగా డీఎస్సీ వల్ల వేలాది మంది నిరుద్యోగుల్లో కొత్త వెలుగులు నిండనున్నాయన్నారు. అన్న క్యాంటీన్ల వల్ల పేదలకు కడుపునిండ అన్నం, పింఛన్ల పెంపు వల్ల వృద్ధులు, దివ్యాంగులకు ఆర్థిక చేయూత ఇచ్చినట్లైంది. ల్యాండ్ టైటిల్ రద్దుతో ప్రజల ఆస్తులకు భద్రత ఏర్పడిందన్నారు. అగ్నికులక్షత్రీయ రాష్ట్ర సాధికార కన్వీనర్ కొప్పాడ రవి మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ళ పాలనలో రాష్ట్రం రోడ్డున పడ్డదేతప్ప అభివృద్ధి ఏమి లేదన్నారు. సమావేశంలో జక్కం శ్రీమన్నారాయణ, వాతాడి ఉమా, అధికారి అనంతరామారావు, కొల్లు పెద్దిరాజు, పాలూరి బాబ్జీ, సంకు భాస్కర్‌లు పాల్గొన్నారు.

ల్యాండ్ టైట్లింగ్ రద్దుపై న్యాయవాదుల హర్షం

నరసాపురం, జూన్ 14: భూ హక్కు చట్టాన్ని రద్దు చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంతకం చేయడంపై నరసాపురం బార్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. శుక్రవారం బార్ అధ్యక్షులు దానయ్యనాయుడు అధ్యక్షతన కోర్టు హాల్‌లో కేక్ కట్ చేశారు. ఇది ప్రజల విజయమన్నారు. కార్యక్రమంలో కానూరి స్వామినాయుడు, బాబ్జీ, సూరిబాబు, జోసఫ్, వెంకటాచార్యులు, సత్యకృష్ణ, పురేళ్ళ శ్రీనివాస్, గునిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

29న జాతీయ లోక్ అదాలత్

నరసాపురం, జూన్ 14: ఈనెల 29న కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా అదనపు న్యాయమూర్తి విజయదుర్గా చెప్పారు. నరసాపురం, మొగల్తూరు, రూరల్ ప్రాంతాలకు చెందిన కక్షిదారులు ఈ అదాలత్‌ను వినియోగించుకోవాలన్నారు. సివిల్, చెక్‌బౌన్స్, కుటుంబ తగాదాలు, బీమా తదితర కేసుల్ని ఈ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చునన్నారు.

పార్కుల అభివృద్ధిపై దృష్టి పెట్టాలి



పార్కు స్థలాలను పరిశీలిస్తున్న కమిషనర్ శ్యామల

భీమవరం టౌన్, జూన్ 14 : పట్టణంలో పార్కుల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని మునిసిపల్ కమిషనర్ ఎం.శ్యామల ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం హౌసింగ్ బోర్డు కాలనీలోని పార్కు స్థలాలను ఆమె పరిశీలించారు. ఇప్పటి వరకు పార్కుల అభివృద్ధికి తీసుకున్న చర్యలపై ఆమె వివరాలను అడిగి తెలుసుకున్నారు. పార్కుల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చెయ్యాలన్నారు.

ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక అధ్యక్షునిగా సుబ్బయ్య



భీమవరం టౌన్, జూన్ 14: రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక అధ్యక్షునిగా గరికిముక్కు సుబ్బయ్య నియమిస్తున్నట్లు సామాజిక సమరసత వేదిక అఖిలభారత కన్వీనర్ శ్యాం ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్సీ ఎస్టీ వర్గాల అభ్యున్నతి కోసం ఈయనను నియమిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించే అన్ని సంక్షేమ పథకాలలో ఎస్సీ ఎస్టీ వర్గాలకు అందరికీ సమానమైన ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా సుబ్బయ్య మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు అర్హులైన వారికే అందేటట్లు చూస్తానన్నారు తప్పుడు మార్గంలో కుల ధ్రువీకరణ పత్రాలు పొందే వారిపై చట్ట రీత్యా చర్యలు చేపట్టేటట్లు చూస్తానన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గొటుకుల జాషవాను నియమించారు.

పూర్తిస్థాయిలో హాజరుకాని విద్యార్థులు

ఉండి, జూన్ 14: వేసవి సెలవులు ముగియడంతో పాఠశాలలు తెరిచారు. ఇంకా పూర్తిస్థాయిలో విద్యార్థులు రాకపోవడంతో తరగతి గదులు ఖాళీగా కనిపిస్తున్నాయి. ఉపాధ్యాయులు మాత్రం కొత్త విద్యార్థుల కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికే ఆయా మండల కేంద్రాలకు పుస్తకాలను 60శాతం సప్లయ్ చేసింది. ఇంకా 40శాతం పుస్తకాలను ప్రభుత్వం పంపించవలసి వుంది. విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్‌లతో పాటు కిట్స్ అందించవలసి వుంది.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీనివాసరావు నియామకంపై హర్షం

గణపవరం, జూన్ 14: టీడీపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా పల్లా శ్రీనివాసరావు నియమితులైనందుకు గణపవరం మండల టీడీపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు పల్లా శ్రీనివాసరావును పార్టీ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా ప్రకటించటం శుభపరిణామం అన్నారు. పిప్పర మండల టీడీపీ కార్యాలయంలో మిఠాయిలు పంచారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఇందుకూరి రామకృష్ణంరాజు, ఉంగుటూరు నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు అద్దేపల్లి వాసురాజు, టీడీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి యాళ్ళ సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలుపై హర్షం

అత్తిలి, జూన్ 14 : ఎన్నికల్లో ప్రజలకిచ్చిన కీలక హామీల అమలుపై సీఎం చంద్రబాబునాయుడు సంతకాలు చేయడం అభినందనీయమని టీడీపీ మండల అధ్యక్షుడు ఆదినారాయణ, కార్యదర్శి సత్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సీఎం చంద్రబాబునాయుడుకు, తణుకు ఎమ్మెల్యే రాధాకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.









డాక్టర్ సత్యనారాయణను సత్కరిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు... కలెక్టరేట్‌లో రక్తదాతకు జేసీ ప్రవీణ్ ఆదిత్య సత్కారం.. పాలకోడేరులో అవగాహన ర్యాలీ.. పాలకొల్లు న్యూలైఫ్ ఆస్పత్రిలో రక్తదాన శిబిరం

రక్తదానం ప్రాణదానంతో సమానం

ఘనంగా రక్తదాతల దినోత్సవం.. పలువురు రక్తదానం

నరసాపురం రూరల్, జూన్ 14: రక్తదానం ప్రాణదానంతో సమానమని డిప్యూటి డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఎల్‌బిచర్ల, తూర్పుతాళ్ళు, వైఎస్‌పాలెం పంచాయితీలు, పీహెచ్‌సీలు వద్ద ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని నిర్వహించారు. సుమారు 50 మంది రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ రక్తాన్ని సేకరించింది. కార్యక్రమలో సర్పంచ్ నాగముత్యమాంబ, వైఎస్ బాబులు, డాక్టర్ అనిల్‌కిరణ్, రమేష్‌రెడ్డి, సతీష్, ఏఎన్ఎం రత్నమాల, ఎంపీటీసీ ఆకన శ్రీదేవి, శ్రీనివాస్, టి.శ్రీదేవి వాసు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పాలకోడేరు: పాలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన కార్యక్రమంతో పాటు ర్యాలీ నిర్వహించారు. వైద్యులు స్వర్ణనిరంజని, డాక్టర్ లీలాలక్ష్మి మాట్లాడుతూ ప్రతీ వ్యక్తి మూడు నెలలకు ఒకసారి రక్తాన్ని దానం చేయవచ్చని అన్నారు. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు తప్ప మిగతా అందరూ కూడా రక్తదానం చేయవచ్చని అన్నారు.

భీమవరం టౌన్: రక్తదానంతో ప్రాణహాని లేదని, రక్తదానంపై ప్రజలలో అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు)అన్నారు. శ్రీ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రపంచ రక్త దాతల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి రక్తదాన ప్రతిజ్ఞ నిర్వహించారు. రక్తదానం చేసిన డాక్టర్ చీడే సత్యనారాయణ, బొడబాటి పెదబాబు, కేవీఎల్ నరసింహారావు, తాతపూడి రాంబాబు, పినిశెట్టి శ్రీలక్ష్మి, కొప్పినీడి బాబి, బందారు మణికంఠ, ఎన్సీసీ క్యాడెట్ బలగం లీలా కుమార్ తదితరులకు ఎమ్మెల్యే అంజిబాబు చేతుల మీదుగా మెమెంటోలు, ప్రశంసాపత్రాలతో సత్కరించారు.

● డాక్టర్ సీఎస్ఎన్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ చీడే సత్యనారాయణను ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజి బాబు) ఘనంగా సన్మానించారు ఇప్పటి వరకు 86 సార్లు రక్తదానం చేసినందుకు ఆయన అభినందించారు. కార్యక్రమంలో సీఎస్ఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సకుమళ్ళ సత్యనారాయణ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం అర్బన్: ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని గొర్రెల సూరన్న పంక్షన్ హాల్‌లో వింగ్స్ ఆఫ్ ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలోను, అలాగే స్థానిక ఆదిత్య కళాశాలలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాలకు బాబ్జి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. గొర్రెల శ్రీధర్, కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, ఎరుబండి సతీష్, పసలపూడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

భీమవరం టౌన్: ఒకరి రక్త దానంతో మరో ముగ్గురికి ప్రాణ దానం చెయ్యవచ్చునని, రక్త దానంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించవలసిన బాధ్యత మనందరిపై ఉందని జిల్లా జాయింటు కలెక్టరు సి.వి.ప్రవీణ్ ఆదిత్య అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ రక్తదాతల దినోత్సవం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయడానికి వీలుకాదని అన్నారు. 18 సంవత్సరాలు నుంచి 55 ఏళ్ల లోపు ఉన్నవారు రక్తదానానికి అర్హులని, స్వచ్ఛందంగా రక్తదానం ఇవ్వడానికి ముందుకు రావాలని కోరారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవ సందర్భంగా జిల్లా జాయింటు కలెక్టరు ప్రతిజ్ఞ చేయించారు. రక్త దాతలు, రక్తదాన ప్రోత్సాహకులు 70 మందిని సత్కరించారు.

పాలకొల్లు: స్థానిక న్యూ లైఫ్ హాస్పటల్లో శుక్రవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పి.మల్లిఖార్జున రావు (తణుకు) విచ్చేసి శిబిరాన్ని ప్రారంభించారు. జిల్లా మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఆసుపత్రి అధ్యక్షులు తటవర్తి కృష్ణ మూర్తి అధ్యక్షత వహించారు. ఈకార్యక్రమంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ మల్లిఖార్జునరావు మాట్లాడుతూ ఆరోగ్యవంతులైన ప్రతీ వారు ఏడాదిలో రెండుమార్లు అయినా రక్తదానం చేయవచ్చునన్నారు. సంస్థ ఎండి డాక్టర్ కెఎస్‌పిఎన్ వర్మ, వలంటరీ బ్లడ్ బ్యాంక్ అధినేత ఎం.సత్యనారాయణ, డైరెక్టర్లు అడ్డాల వాసు, పేరిచర్ల గోపాలరాజు, తటవర్తి శారద, అభిషేక్ పాల్గొన్నారు.

పిల్లల్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి

పెనుగొండ, జూన్ 14: మూడు సంవత్సరాలు నిండిన పిల్లలందరిని అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.విజయ కుమారి అన్నారు. కొఠాలపర్రు గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ గ్రాడ్యుయేషన్ కార్యక్రమం నిర్వహించారు. 5 సంవత్సరాలు పూర్తి చేసుకుని 1వ తరగతిలో చేరుతున్న విద్యార్థులకు గ్రాడ్యుయేషన్‌డే నిర్వహించారు. అదేవిధంగా అంగన్‌వాడీ పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించి అనంతరం ర్యాలీ నిర్వహించారు.

బాధితురాలికి ఆర్థిక సాయం



ఆచంట, జూన్ 14: తూర్పుగోదావరి జిల్లా అల్లవరం మండలం బెండమూరు లంకకు చెందిన ముదునూరి వరలక్ష్మి ఇటీవల కరెంట్ షాక్‌కు గురి కావడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీనితో ఆచంట మండలం భీమలాపురానికి చెందిన వ్యక్తులు మస్కట్‌లో ఏర్పాటు చేసిన శ్రీ మహాత్మ జ్యోతిరావుపూలే గల్ఫ్ బీసీ సేవా సమితి ద్వారా శుక్రవారం బెండమూరులంకలో రూ. 64,500 రూపాయల ఆర్థిక సాయాన్ని అందించారు. సేవా సమితి అధ్యక్షుడు చప్పిడి వర ప్రసాద్, స్థానిక సర్పంచ్ గుబ్బల మాధవరావు, బెండమూరిలంక సర్పంచ్ చేతుల మీదుగా బాధితురాలికి ఈ ఆర్థిక సాయం అందించారు.

జడ్పీటీసీ చాంబర్ ఏర్పాటు

ఆచంట, జూన్ 14: ఆచంట మండల పరిషత్ కార్యాలయంలో జడ్పీటీసీ చాంబర్‌ను ఏర్పాటు చేశారు. ఈ చాంబర్‌ను ఈ నెల 16న జరగనున్న మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో హాజరుకానున్న ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ ప్రారంభించనున్నారు. జడ్పీటీసీగా విజయం సాధించిన ఉప్పలపాటి సురేష్‌బాబుకు గత ప్రభుత్వం చాంబర్ ఏర్పాటు చేయకపోవడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మరలా ఇపుడు జడ్పీటీసీ చాంబర్‌ను మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు.

రేపు ఆచంట మండల సమావేశం

ఆచంట, జూన్ 14: ఈ నెల 16వ తేదీ ఉదయం 10 గంటలకు ఆచంట మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం ఎంపీపీ దిగుమర్తి సూర్య కుమారి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పి. నరసింహ ప్రసాద్ తెలిపారు. ఈ సమావేశానికి అధికారులు అన్ని వివరాలతో హాజరు కావాలని తెలిపారు.

శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే రఘురామ దంపతులు



ఉండి, జూన్ 14: తిరుపతిలో శ్రీవారిని కుటుంబ సమేతంగా దర్శించుకోవడం ఆనందంగా ఉందని ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామ కృష్ణరాజు అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే దంపతులు శ్రీవారిని దర్శించుకున్నారు. నూతన ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని స్వామివారిని కోరుకున్నట్లు తెలిపారు.

సీఎం చంద్రబాబును కలిసిన మంతెన, ఆరిమిల్లి



ఉండి, జూన్ 14: ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న చంద్రబాబు నాయుడును శుక్రవారం అమరావతిలో జిల్లా టీడీపీ అధ్యక్షుడు మంతెన రామరాజు, తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ కలుసుకున్నారు. బొకేలు అందించి అభినందనలు తెలిపారు. ఉండి మండలం పాందువ్వ గ్రామానికి మాజీ ఎమ్మెల్సీ మంతెన సత్యనారాయణరాజు(పాందువ్వ శ్రీను) కూడా సీఎం చంద్రబాబును కలిసి అభినందనలు తెలిపారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 14: గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా పంచాయతీ అధికారి జార్జి విక్టర్ సూచించారు. పెదతాడేపల్లిలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈవోపీఆర్డీ ఎం. వెంకటేష్, కార్యదర్శి టి. రవిచంద్ పాల్గొన్నారు.

గణపవరం: వర్షాకాలంలో పారిశుధ్య పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలని, గ్రామాల్లో చెత్త తొలగింపుతోపాటు, డ్రెయిన్ల ప్రక్షాళన వేగవంతం చేయాలని జిల్లా గ్రామ పంచాయతీ అధికారి ఆర్.విక్టర్ కోరారు. గణపవరంలో శుక్రవారం జరుగుతున్న పారిశుధ్య కార్యక్రమాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. గ్రామాల్లో ముఖ్యంగా కాలనీలో డ్రెయిన్లలోని చెత్త, షిల్టు తొలగించాలని అధికారులను ఆదేశించారు. పరిశుభ్రత పాటించకపోతే భారీ వర్షాలు పడి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.సూర్యనారాయణ, సర్పంచ్ మూరా అలంకారం, గ్రామ కార్యదర్శి డి.శివరామప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కాల్వను తవ్వించుకున్న రైతులు



ఉండి, జూన్ 14: నీటిపారుదల నిలిచిపోయి అధ్వానంగా వున్న రక్కిసకోడును స్థానిక రైతులు ముందుకు వచ్చి స్వచ్ఛందంగా ఎక్స్‌కవేటర్‌తో తవ్వించుకున్నారు. ఉండి గ్రామంలోని ఎన్‌హెచ్ రహదారిని ఆనుకుని ఎస్‌ఆర్‌పిఅగ్రహారం ఎస్సీ బీసీకాలనీల వెంబడి వెళ్లిన రక్కిసకోడును ఆనుకుని సుమారుగా 200ఎకరాలు రైతులు సాగును చేస్తున్నారు. అయితే ఈకోడు పూడుకుపోవడంతో రైతులు స్వచ్ఛందంగా తవ్వించుకున్నారని గ్రామ టీడీపీ అధ్యక్షుడు రాంబాబు, భీమవరం రైతు కార్యాచరణసమితి అధ్యక్షుడు పాతపాటి మురళీరామరాజు తెలిపారు.

చీకటి చట్టాన్ని రద్దుచేసిన సూరీడు చంద్రన్న

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 14: జగన్ తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దుచేసి పేదలకు అండగా నిలిచిన సూరీడు చంద్రబాబు నాయుడు అని మాజీ ఏపీపీ కుసులూరి శివరామకృష్ణ అన్నారు. బార్ అసోసియేషన్ భవనం వద్ద చంద్రబాబు విగ్రహానికి పాలభిషేకం చేశారు. టీడీపీ లీగల్ సెల్ జిల్లా నాయకుడు వాసు మాట్లాడుతూ ల్యాండ్ టైటిలింగ్ యాక్టు చీకటి కోణాన్ని వెలుగులోకి తెచ్చింది న్యాయవాదులేనని గుర్తుచేశారు. సంఘ నాయకులు భూపాల్, మీసాల ఏసుపాదం, పరమేశ్వరరావు పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం



పాలభిషేకం చేస్తున్న తోట సీతారామలక్ష్మి, పార్టీ నాయకులు

భీమవరం అర్బన్, జూన్ 14: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంతో రాష్ట్ర ప్రజలు చంద్రబాబు చిత్రపటాలకు పాలభిషేకాలు చేస్తున్నారని రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యురాలు, భీమవరం నియోజకవర్గ ఇన్‌చార్జి తోట సీతారామలక్ష్మి అన్నారు. పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఇందుకూరి సుబ్రహ్మణ్యంరాజు ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక నరసయ్య అగ్రహారంలో టీడీపీ నాయకులు, ప్రజలు చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం చేశారు. పార్టీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి, పార్టీ నాయకులు మెరగాని నారాయణమ్మ, గునుపూడి తిరుపాల్, గంటా త్రిమూర్తులు, మాదాసు కనకదుర్గ, ఎండీ షబీనా పాల్గొన్నారు.

తణుకు: కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఐదు ప్రధాన హామీలకు ముఖ్యమంత్రి చంద్రబాబు సంతకాలు చేయడంతో పాటు అమలుకు ఉత్తర్వులివ్వడంపై ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మొదటి సంతకం మెగా డీఎస్సీ పైనే పెట్టారని తెలిపారు. మూడు వేలు నుంచి నాలుగు వేలకు పింఛన్లు పెంచుతూ రెండో సంతకం చేశారని వివరించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, యువతకు ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకునే స్కిల్ సెన్సస్‌పై ఉత్తర్వులు ఇవ్వడం జరిగిందన్నారు. సమావేశం అనంతరం చంద్రబాబు చిత్రపటానికి ఆయన పాలభిషేకం చేశారు.

కేంద్ర మంత్రి వర్మను కలసిన బొలిశెట్టి, ఆరిమిల్లి

తాడేపల్లిగూడెం అర్బన్/తణుకు, జూన్ 14: కేంద్ర ఉక్కు, గనుల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ శుక్రవారం భీమవరంలో మర్యాదపూర్వకంగా కలసి సత్కరించారు. పుల్లా బాబి, పాలూరి వెంకటేశ్వ రరావు, బేతిన గిరిధర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా ఎస్పీ అజితను మర్యాదపూర్వకంగా బొలిశెట్టి కలసి పుష్పగుచ్ఛం అందజేశారు.

మాజీ మంత్రి కొట్టు విమర్శలు మానుకోవాలి



విలేకరులతో మాట్లాడుతున్న వలవల

తాడేపల్లిగూడెం అర్బన్, జూన్ 14: మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ కూటమి నాయకులు, కార్యకర్తలపై లేనిపోని విమర్శలు చేస్తున్నారని, నోరు అదుపులో పెట్టుకోకపోతే చూస్తూ ఊరుకోమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి హెచ్చరించారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ తాడేపల్లిగూడెం రూరల్ మండలంలో శిలాఫలకం ధ్వంసమైన విషయంలో మాజీ మంత్రి కొట్టు కూటమి నాయకులే ఈ పనిచేశారని ఆరోపించడం సరికాదన్నారు. కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

గోవధకు పాల్పడితే కఠిన చర్యలు

పెంటపాడు, జూన్ 14: గోవధ, ఆవుల అక్రమ రవాణా చేస్తే చట్టపరంగా చర్యలు తప్పవని పశుసంవర్ధక శాఖ తాడేపల్లిగూడెం సబ్ డివిజన్ ఏడీఏ డాక్టర్ అనిల్ అన్నారు. పశుసంవర్ధక శాఖ సిబ్బంది ఇలాంటి ఘటనలు జరగకుండా నిఘా పెట్టాలన్నారు. జంతు సంక్షేమ సంఘం ఎస్‌పీసీఏ ఆధ్వర్యంలో శుక్రవారం పెంటపాడులో ర్యాలీ నిర్వహించారు. వెటర్నరీ వైద్యుడు డాక్టర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

ఉండి, జూన్ 14: ఉండి మెయిన్ పాఠశాలలో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ సాగిరాజు సాంబశివరాజు దంపతులు ఆర్థిక సహాయంతో విద్యార్థులకు విద్యా సామగ్రిని అందించారు. లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేగేశ్న అనంతలక్ష్మీ, కనెగ్నంటి రూత్‌కళ, లయన్స్ సత్తి బ్రహ్మారెడ్డి, హరినాధరాజు, సీతారామరాజు, నరసరాజు, రంగరాజు, మహంకాళి, రాము, కాశీవిశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

19న ఐటీఐలో జాబ్‌మేళా

ఉండి, జూన్ 14: ఈనెల 19వ తేదీన ఉండి పారిశ్రామిక శిక్షణ సంస్థలో క్యాంపస్ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఐటిఐ ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరాజు తెలిపారు. ఈమేళాకు ప్రభుత్వ ప్రైవేట్ ఐటీఐలలో ఈసంవత్సరం జూలై 2024 ఏఐటీటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు, వివిధ కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులు అర్హులన్నారు. ఇతర వివరాలకు ఉండి ఐటిఐ ప్రధానాధికారి ఫోన్ నెంబరు 98493 26884 నెంబరును సంప్రదించాలని వారు కోరారు.

ఎమ్మెల్యే ధర్మరాజును కలసిన సీపీఎఫ్ ఉద్యోగులు

గణపవరం, జూన్ 14: థాయిలాండ్ సంస్థ యాజమాన్యం నుంచి తమకు న్యాయం చేయాలని సరిపల్లెలోని సీపీఎఫ్ రొయ్యల మేతల తయారీ ఫ్యాక్టరీ ఉద్యోగులు, కార్మికులు కోరారు. శుక్రవారం సరిపల్లె ఫ్యాక్టరీ వద్ద 8వ రోజు కార్మికులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వెళ్లి ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజును కలిసి మొరపెట్టుకున్నారు. మూసివేసిన ఫ్యాక్టరీని తెరిపించాలని న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలని, వేతనాలు ఇప్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ

భీమవరం అర్బన్, జూన్ 14: అల్లూరి సీతారామరాజు భగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మెంటే వారితోటలోని సుందరయ్య భవనంలో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని వసుధ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ ఇందుకూరి ప్రసాదరాజు ప్రారంభించారు. ఈ కేంద్రంలో కుట్టు మిషన్, కటింగ్, ఎంబ్రాయిడరీ నేర్పబడుతుందన్నారు. విజ్ఞాన కేంద్ర ట్రస్టు చైర్మన్ బలరాం పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వానికి ఐలు కృతజ్ఞతలు

తణుకు, జూన్ 14: ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు చేస్తూ సీఎం చంద్రబాబు సంతకం చేయడం పట్ల ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) హర్షం వ్యక్తం చేసింది. శుక్రవారం తణుకు బార్ అసోసియేషన్‌లో ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపింది. న్యాయవాదులు గత నాలుగు నెలలుగా జగన్ తీసుకొచ్చిన నల్ల చట్టం రద్దుకు వివిధ రూపాల్లో ఉద్యమాలు చేశారని చెప్పారు. న్యాయవాదులు ఆకుల వెంకట సత్యనారాయణ, కౌరు వెంకటేశ్వర్లు, ఆద రామకృష్ణ, అంబేడ్కర్, కామన మునిస్వామి, చింతపల్లి నాగేశ్వరరావు, అనుకుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సోమేశ్వరస్వామికి కేంద్ర మంత్రి పూజలు



కేంద్ర మంత్రి వర్మ దంపతులను ఆశీర్వదిస్తున్న అర్చకులు

భీమవరంటౌన్, జూన్ 14 : ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ కేంద్ర సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ, వెంకటేశ్వరీ దంపతులు శుక్రవారంరాత్రి గునుపూడిలోని సోమేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేయించుకున్నారు. ఆలయానికి వచ్చిన దంపతులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దేవస్థానం తరుపున శేష వస్త్రాన్ని, ప్రసాదాన్ని అందించారు.

మంత్రి నిమ్మలకు అభినందనలు



పాలకొల్లులో కాటన్ విగ్రహం వద్ద టీడీపీ నాయకుల సంబరాలు

పాలకొల్లుఅర్బన్/ పాలకొల్లు రూరల్/పోడూరు, జూన్ 14 : రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన పాలకొల్లు ఎమ్మెల్యే డాక్టర్ నిమ్మల రామానాయుడును గురువారం సాయంత్రం పాలకొల్లు టీడీపీ నాయకులు అమరావతిలో కలిసి అభినందనలు తెలిపారు. వీరిలో టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కర్నేన గౌరునాయుడు, దేవాంగ సాధికార కమిటీ రాష్ట్ర కన్వీనర్ బీరక ప్రసాద్, బీసీ విభాగం రాష్ట్ర అధికా ప్రతినిధి ఆనచంద్ర ప్రసాద్, మాణిక్యాలరావు, పవన్, దుర్గారావు తదితరులు ఉన్నారు. మంత్రిగా రామానాయుడు బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో శుక్రవారం పాలకొల్లు, పోడూరులలో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు బాణసంచాలు కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు.